క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక


కండువా కప్పుతున్న ఎమ్మెల్యే బాలకిషన్

శంకరపట్నం: ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో సోమవారం శంకరపట్నం మండలానికి చెందిన కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. గద్దపాకకు చెందిన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కనుకుంట్ల సాగర్, కాచాపూర్ బీఎస్పీ గ్రామశాఖ అధ్యక్షుడు కనుకుంట్ల అరవింద్, నాయకులు గాజుల సంపత్, నేలవేని శంకర్ తదితరులకు ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో కండువాలు కప్పారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమేశ్, సింగిల్‌విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ పర్శరాములు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంపత్, నాయకులున్నారు.

దేవేందర్‌రెడ్డి.. బాగున్నావా?

• ఇఫ్కో మాజీ డైరెక్టర్‌ను పలకరించిన సీఎం కేసీఆర్


సీఎంకు నమస్కరిస్తున్న దేవేందర్‌రెడ్డి

తిమ్మాపూర్: సోమవారం మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య దశదిన కర్మకు హాజరైన సీఎం కేసీఆర్ అక్కడే ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఇఫ్కో మాజీ డైరెక్టర్ కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డిని పలకరించారు. దేవేందర్ రెడ్డి.. బాగున్నావా అంటూ కాసేపు ముచ్చటించారు.

నేడు మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో వేలం

శంకరపట్నం: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని లడ్డూ, ప్రసాదం, కొబ్బరి కాయలు, పూజాసామగ్రి విక్రయించేందుకు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న వ్యాపారులు వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఆలయానికి విరాళం

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు అరవింద్–ప్రశాంతిలు రూ.5,116 సోమవారం విరాళంగా అందజేశారు. అలాగే మండలంలోని చాకలివానిపల్లెకు చెందిన ప్రతాపరెడ్డి–లక్ష్మిలు అమ్మవారికి రూ.13 వేల విలువైన బంగారు బొట్టుబిల్లను కానుకగా అందించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకుడు నాగసాయిశర్మ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

సైదాపూర్: మండలంలోని ఆకునూర్, రామచంద్రాపూర్ గ్రామాల్లో వ్యవసాయాధికారులు సోమవారం పంటలను పరిశీలించారు. మొక్కజొన్నకు ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించి, వాడాల్సిన మందులను రైతులకు సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి, ఏవో వైదేహి, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగేందుకు యత్నం

మానకొండూర్: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన పప్పు లక్ష్మయ్య పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వెంటనే 108 సమాచారం అందించి, అతన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. కాగా లక్ష్మయ్య ఆదివారం ఇంట్లో తన భార్యతో గొడవపడి, మద్యం సేవించి, గ్రామంలో హంగామా చేసినట్లు స్థానికులు తెలిపారు.

ప్రతిపక్ష నాయకుల అరెస్టు

గంగాధర: సీఎం కేసీఆర్ సోమవారం కరీంనగర్ వచ్చిన సందర్భంగా గంగాధర మండలంలోని బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టుగా చేసి, ఠాణాకు తరలించారు. అరెస్టయిన వారిలో పెరుక శ్రావణ్‌కుమార్, కోల అశోక్, రామిడి రాజిరెడ్డి, నల్లాల రాజేందర్ తదితరులున్నారు.

అరెస్టు అప్రజాస్వామికం

రామడుగు: సీఎం కేసీఆర్ కరీంనగర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం సరికాదని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాజమల్లయ్య ఒక ప్రకటనలో అన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి శ్రీ మహాచండి యాగం

రామడుగు: మండలంలోని వెదిర శ్రీ హరిహర క్షేత్రం (శ్రీ భక్త మార్కండేయ దేవాలయం)లో మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు శ్రీ మహాచండి యాగం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన పూజారి రోహిత్ త్రిపాఠిశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు


ఖాసీంపేటలో శివలింగాలపై నీళ్లు పోస్తున్న భక్తులు


సీతంపేటలో విజేతలకు బహుమతి అందిస్తున్న బీజేపీ నాయకులు

మానకొండూర్/హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/గన్నేరువరం/ఇల్లందకుంట: మండలాల్లో సంక్రాంతి వేడుకలను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ఎదుట రంగురంగుల రంగవల్లులు వేశారు. పిండి వంటలు చేస్తూ సంతోషంగా గడిపారు. చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ సందడి చేశారు. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంప్రదాయాలను కాపాడాలి..

పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. ఆదివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని హనుమాన్ దేవాలయ సమీపంలో ఎడ్ల బండ్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఏటా ఈ పండుగ సందర్భంగా ఎడ్ల బండ్లను తిప్పే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఖాసీంపేట గ్రామంలో శ్రీమానసాదేవి, పారువెల్లలోని శ్రీలక్ష్మీగణపతి, మైలారంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి. స్థానికులతోపాటు విజయవాడ, మహారాష్ట్ర, ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు.

రంగవల్లుల పోటీలు..

ఇల్లందకుంట మండలంలోని సీతంపేట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం రంగవల్లుల పోటీలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రకరకాల ముగ్గులు వేశారు. న్యాయనిర్ణేతలుగా ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, భోగంపాడు సింగిల్‌విండో చైర్మన్ కళ్లెం సత్యనారాయణరెడ్డిలు హాజరయ్యారు. కరోనా సమయంలో అన్ని వ్యవస్థలు బంద్ ఉన్నా దేశానికి అన్నం పెట్టే రైతు మాత్రం పని చేశాడని చెప్పేలా ముగ్గు వేసిన ఆనందపు ప్రవళిక మిత్రబృందానికి ప్రథమ బహుమతి అందించారు. ద్వితీయ బహుమతి ఉప్పుల మమత, తృతీయ బహుమతి పిట్టల శ్రీలత, కన్సోలేషన్ బహుమతులు పోతన లత, బోయిని ప్రవళికలు అందుకున్నారు. నాయకులు సతీశ్, రాజు, శ్రీనివాస్, అశోక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


హుజూరాబాద్: ఎడ్లబండ్లు తిప్పే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు

వైఎస్సార్‌టీపీ నాయకుల ముందస్తు అరెస్టు


నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

ఇల్లందకుంట: మంగళవారం వైఎస్సార్‌టీపీ కలెక్టరేట్ ముట్టడి నేపథ్యంలో ఆ పార్టీ నాయకులను పోలీసులు సోమవారం ముందుస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చి, చిన్న, సన్నకారు రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. దాదాపు 12 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించే పరిస్థితిలో ప్రభుత్వం లేదని పేర్కొన్నారు. ఆ పోర్టల్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో శ్రీనివాస్, నితీష్, నరేష్ న్నారు.

మొగి పురుగు నివారణపై అవగాహన


ఖాసీంపేటలో పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు


గన్నేరువరం: వరిలో మొగి పురుగు నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఖాసీంపేట క్లస్టర్ రైతు వేదికలో రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి వరి పంటను పరిశీలించి, అన్నదాతలకు పలు సూచనలు చేశారు. నాటు వేసి, 20 నుంచి 30 రోజుల మధ్యలో ధనుక కంపెనీ వారి మోర్టార్ మందును 150 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నాటు వేసి, 15 రోజులలోపు అయితే కెల్డన్ 250 నుంచి 300 గ్రాముల పొడిని నీటిలో కలిపి, పిచికారీ చేయాలని చెప్పారు. నారుమడిలోనే మొగి పురుగును గుర్తించినట్లయితే నివారణకు క్లోరోపైరిఫాస్ 50 ఈసీని 2 ఎంఎల్‌ను ఒక లీటర్ నీటిలో కలిపి, పిచికారీ చేయాలన్నారు. ఏవో కిరణ్మయి మాట్లాడుతూ.. పై మందులను స్ప్రే చేసిన రెండు రోజుల తర్వాత తప్పనిసరిగా జింక్ 250 గ్రాములను, మల్టీకే కేజీ ఎకరానికి నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మానసాదేవి ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, ఏఈవో అంజలి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జమ్మికుంట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు సంక్షేమ పథకాలు అందిస్తూ, వారికి అండగా నిలుస్తోందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోల్నేని సత్యనారాయణరావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం పీఏసీఎస్ వార్షిక క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు సహకరించకున్నా సీఎం కేసీఆర్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మేడిపల్లి మొగిలి, సీఈవో శ్రీనివాస్, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కార్టూన్ పోటీల్లో ప్రతిభ


భూపతి వేసిన కార్టూన్

కరీంనగర్ కల్చరల్: తానా ఇటీవల తెలుగు భాషా సంస్కృతి అంశంపై మెయిల్ మాధ్యమం ద్వారా నిర్వహించిన కార్టూన్ పోటీల్లో కరీంనగర్‌కు చెందిన కార్టూనిస్ట్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తునికి భూపతి ప్రతిభ కనబర్చి ఉత్తమ కార్టూనిస్ట్‌గా ఎంపికయ్యారు. సోమవారం ఫలితాలు విడుదల కాగా.. తానా ప్రపంచ సాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్, తెలంగాణ కార్టూనిస్టుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజాకీరా హుస్సేన్, వేముల రాజమౌళి, సభ్యులు అభినందనలు తెలిపారు.

క్రికెట్ పోటీలు



చొప్పదండి: భూపాలపట్నంలో యువతకు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు జెడ్పీటీసీ సభ్యురాలు మాచర్ల సౌజన్య, వైస్‌ఎంపీపీ మునిగాల విజయలక్ష్మి, సర్పంచ్ ఏలేటి లావణ్య, ఉప సర్పంచ్ బైరగోని కిట్టుగౌడ్‌లు బహుమతులు ప్రదానం చేశారు. నాయకులు మునిగాల సుధాకర్ గౌడ్, తోడేటి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

• మంత్రి గంగుల కమలాకర్


పనులు పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్

కరీంనగర్ సిటీ: కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి ఆ దిశగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తీగలవంతెనకు అనుబంధంగా నిర్మిస్తున్న కరీంనగర్‌లోని కాపువాడ, రాజాథియేటర్ వద్ద రోడ్లను మేయర్ సునీల్ రావుతో కలిసి సోమవారం పరిశీలించారు. అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ రాక ముందు కరీంనగర్ అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. స్వరాష్ట్రం వచ్చాక వందల కోట్ల రూపాయల నిధులతో నగరంలో మట్టిరోడ్లు కనపడకుండా రోడ్లు అభివృద్ధి చేశామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ స్తంభాల స్థానంలో విద్యుత్ టవర్లు వేశామని, రూ.250 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని అన్నారు. త్వరలోనే డైనమిక్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి కేబుల్ బ్రిడ్జి ప్రారంభిస్తామని తెలిపారు. మానేరు రివర్ ఫ్రంట్ నిర్మాణంతో సౌత్ ఇండియాలో అట్రాక్టివ్ సిటీగా కరీంనగర్ మారుతోందన్నారు. రోడ్లు ఆక్రమణకు గురికాకుండా ప్రజలు, వ్యాపారులు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఫ్రీజింగ్ ఎత్తివేయండి

రామడుగు: సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు తీసుకోలేని దుస్థితి నెలకొందని గోపాల్‌రావుపేట సర్పంచ్ కర్ర సత్యప్రసన్న ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ నిధులపై విధించిన ఫ్రీజింగ్‌ను వెంటనే ఎత్తివేయాలని, చెక్కులు పాసయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు ‘భగీరథ’ సమస్యలపై ప్రత్యేక సమావేశం

రామడుగు: మండల కేంద్రంలో మంగళవారం మిషన్ భగీరథ సమస్యలు, జీపీడీపీపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం ఆశ్రమానికి సరుకుల వితరణ


సరుకులు అందిస్తున్న మధు మిత్రులు

జమ్మికుంట: హుజురాబాద్ పట్టణానికి చెందిన కోలనూరి మధు గతేడాది అనారోగ్యంతో మృతి చెందాడు. స్నేహితుడి జ్ఞాపకార్థం ప్రథమ వర్ధంతి సందర్భంగా అతనితో కలిసి డిగ్రీ చదివిన స్నేహితులు జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని స్పందన అనాథ ఆశ్రమ పిల్లలకు ఆదివారం భోజనం ఏర్పాటు చేశారు. రూ.30 వేల విలువైన వంట సరుకులు, బీరువా, 25 బ్లాంకెట్లు అందజేశారు. కార్యక్రమంలో అజీమొద్దీన్, పులి అనిల్, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

చొప్పదండి: పట్టణంలోని అయిదో వార్డు పరిధి ఇందిరానగర్‌లో అంబేడ్కర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రూ.5 లక్షల నిధులు మంజూరు చేసినట్లు కౌన్సిలర్ బిజిలి అనిత సోమవారం తెలిపారు. స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా భవనాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట శ్రీకర్, స్వామి, అంజయ్య, నర్సయ్య, లజెండ్ యూత్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడికి గాయాలు


గాయపడిన మంకయ్య

శంకరపట్నం: కొత్తగట్టు శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీగల మంకయ్య అనే గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కొత్తగట్టుకు చెందిన మంకయ్య సోమవారం తాటి చెట్లు ఎక్కి, బైక్‌పై రోడ్డుపైకి వస్తున్నాడు. ఈ క్రమంలో కేశవపట్నం నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో మంకయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

పెరిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తిమ్మాపూర్: పురగిరి క్షత్రియ (పెరిక సంఘం)నూతన క్యాలెండర్‌ను మక్తపల్లి గ్రామంలో ఆ సంఘం అధ్యక్షుడు గాండ్ల రాము వర్మ ఆదివారం ఆవిష్కరించారు. పెరిక కులస్తుల సంక్షేమానికి సంఘం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాండ్ల భాగ్యలక్ష్మి, నాయకులు గాండ్ల సత్యం, చింతం లక్ష్మణ్, శ్రీనివాస్, సదానందం పాలేటి జనార్దన్, తమ్మిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ క్షేమంగా ఉండాలి

• ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి: కొత్త ఏడాది ప్రజలందరూ క్షేమంగా ఉండాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆకాంక్షించారు. చొప్పదండి పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో హోలీ షాలోం చర్చి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన యేసుక్రీస్తు వాగ్దాన పండుగ కార్యక్రమాన్ని ఆయన కేక్ కట్ చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ థామస్ దైవజనులకు శాంతి సందేశం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

• పెన్షనర్ల రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొడిగూటి మొగిలయ్య


మొగిలయ్యను సన్మానిస్తున్న ఉద్యోగులు

జమ్మికుంట: పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని పెన్షనర్ల రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొడిగూటి మొగిలయ్య అన్నారు. సోమవారం జమ్మికుంట పట్టణంలోని విస్డమ్ కళాశాలలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బెట రవీందర్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అనేక సమస్యలున్నాయని, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి, పరిష్కరించేలా చూడాలని కోరగా సానుకూలంగా స్పందించారు. పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు మోహన్‌రావు, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రభాకర్, లక్ష్మణ్‌దాస్, భావన ఋషి, కొమురెల్లి, శ్యాం, సభ్యులు సురేందర్, చంద్రయ్య, మల్లయ్య, సాంబయ్య, రాజేశ్వర్ రావు, రామచంద్రం, లక్ష్మయ్య తదితరులున్నారు.

‘కంటి వెలుగు’ సద్వినియోగం చేసుకోవాలి

సైదాపూర్: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి నిర్వహించే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సైదాపూర్ మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాములు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతీ గ్రామంలో కంటి వెలుగు వైద్య శిబిరాలు నిర్వహిస్తారని, కంటి సమస్యలున్నవారు పరీక్షలు చేయించుకొని, కంటి అద్దాలు తీసుకోవాలని కోరారు.

చొప్పదండి: కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బందారపు అజయ్‌కుమార్ కోరారు. చొప్పదండి మండలంలోని రెవెల్లి గ్రామంలో హనుమాన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఆయన ప్రచారం చేశారు. వైద్యులు కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి అద్దాలను ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఆయన వెంట నాయకులు అనిల్ రెడ్డి, సతీశ్, మహేశ్, అనీష్, జితేందర్ రెడ్డి తదితరులున్నారు.

కో–ఆప్షన్ పదవులను భర్తీ చేయండి


మాట్లాడుతున్న ఎండీ అఫ్సర్

హుజూరాబాద్: రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఖాళీగా ఉన్న కో–ఆప్షన్ పదవులను వెంటనే భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ అఫ్సర్ డిమాండ్ చేశారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలప్పుడే ప్రభుత్వానికి మైనార్టీలు గుర్తుకు వస్తారని, తర్వాత వారిని పక్కన పెడతారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. కో–ఆప్షన్ పదవులను భర్తీ చేయకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు చాంద్, రియాజ్, ముఖీద్, ఆసిఫ్, ఇమ్రాన్, ఖయ్యూం, సిరాజ్ ఖాదర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రేణుక

వీణవంక: గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఎంపీపీ మూసిపట్ల రేణుక అన్నారు. వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాసారపు అనిల్ స్మారక మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆమె సోమవారం ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, సర్పంచ్ నీలకుమార్, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గంగాడి తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ ఓరెం భానుచందర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాసరాపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు


రశీదు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేశారని ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఆకుల రాజేందర్ ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన సంజీవని మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ రూ.10,116, ఇమ్మడి శ్రీలత–శ్రీనివాస్ రూ.11,116, పొనగంటి సతీశ్ రూ.10,116, దాసారపు మానస–సమ్మయ్య రూ.10,116 అందించినట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేందర్, సభ్యులున్నారు.

సీసీరోడ్డు నిర్మించాలంటూ అర్ధనగ్న ప్రదర్శన


రామడుగు: తమ కాలనీకి సీసీరోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట ఎస్సీ కాలనీవాసులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే రోడ్డు నిర్మించాలని కోరారు.